# "సత్యమే దైవము"

ప్రేమస్వరూపులారా!

మానవత్వమనగా కేవలము ప్రాకృత చర్యలతో కూడినదని భావిస్తుంటారు. ఇవి ప్రాకృతమైనవేగానీ పారమార్థికము కాదు. ఉన్నది ఉన్నట్లు, చేసినది చేసినట్లు, చూచినది చూచినట్లు చెప్పటం ప్రాకృతమైన సత్యము. కానీ, పారమార్థిక సత్యము మరొకటి ఉన్నది. ఇది దేశకాల పరిస్థితులకు అతీతమైనది. ఇది ఒక దేశమునకు, ఒక కాలమునకు, ఒక వ్యక్తికి సంబంధించినది కాదు. ఇది త్రిగుణాతీతమైన సత్యము. ఈ సత్యమే ప్రత్యక్ష దైవము. సర్వము ఈ సత్యమునుండియే ఆవిర్భవించుచున్నది.

**సత్యంబునందుండి సర్వంబు సృష్టించె**
**సత్యంబునందణగె సర్వసృష్టి**
**సత్యమహిమ లేని స్థలమేది కనుగొన్న**
**శుద్ధ సత్త్వమిదియె చూడరయ్య.**

పంచభూతములు సత్యమునుండియే ఆవిర్భవించినవి. ఇట్టి సత్యమును మనము గుర్తించుకొనలేక కేవలము భౌతికమైన, ప్రాకృతమైన నిజమును మాత్రమే సత్యముగా భావిస్తున్నాము. భౌతికమైన నిజము కంటికి కనుపించునది, చెవులకు వినిపించునది, మనసునకు అనిపించునది. హృదయమును మురిపించునది, మైమరపించునది. ఇది ప్రాకృతమైన నిజము. నిజమనగా మనము చూచుచున్న సమయమందు మాత్రమే స్వరూపము ఉంటుంది. తదుపరి దీని స్వరూపము మార్పు చెందుతుంది.

**త్రికాలా బాధ్యం సత్యం**

కానీ పారమార్థిక సత్యము త్రికాలములందు మార్పు చెందక ఉంటుంది. కనుకనే 'త్రికాలాబాధ్యం సత్యం' అన్నారు. ఇది సృష్టికే మూలాధారమైనది. సత్యమనగా ఎట్టిది?

sri sathyasaivachanamrutam

స+ఇ+యమ్= సత్యము. స–ప్రాణము, ఇ– అన్నము, యమ్ – సూర్యుడు. ప్రతి జీవికి ప్రాణము ప్రధానము. ప్రాణమునకు అన్నము ఆధారము. ప్రపంచమును సస్యశ్యామలము చేసి ఆహారము నందించునది సూర్యుడు. ప్రాణము, ఆహారము, సూర్యుని తత్వముతో కూడినదే సత్యము. రాముడు బ్రహ్మ స్వరూపమే! ప్రాణము బ్రహ్మ, అన్నము బ్రహ్మ, సూర్యుడు బ్రహ్మ. రెండవరీతిగా మనము విచారణ చేసినప్పుడు స+త+య=సత్య. దీనిని తిరగ చెప్పినప్పుడు యతస అవుతుంది. య–యమనియమాదులతో, త–తపస్సు ఆచరించినప్పుడు, స–సత్యస్వరూపుడైన భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. యమనియమాదులనగా అంతర్బహిరింద్రియములను అరికట్టటము, స్వాధీన పరచుకోటం. ఇంద్రియముల నరికట్టి తపస్సు చేయటం. తపస్సనగా ఏమిటి? తల క్రిందకు పెట్టి, కాళ్ళు పైకి పెట్టి దీక్షను పూనటం కాదు. తపస్సనగా త్రికరణ శుద్ధి. హృదయములో ఆవిర్భవించినదానిని ఉచ్చరించి, వాక్కుద్వారా ఉచ్చరించిన దానిని హస్తముతో ఆచరించటమే తపస్సు.

దీనినే త్రికరణ శుద్ధి అన్నారు. యమనియమాదులతో త్రికరణ శుద్ధితో నున్నప్పుడు సత్యము అనే భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. కనుకనే 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ'. సత్యమే జ్ఞానము, జ్ఞానమే అనంతము, అనంతమే బ్రహ్మ. అనంతమైన స్వరూపము ధరించినది బ్రహ్మ. కనుక సత్యమనగా సాక్షాత్తు భగవత్స్వరూపమే గానీ ఈనాటి మానవుడు ప్రాకృతమైన నిజమును సత్యముగా భావించి పారమార్థిక సత్యమును విస్మరించి ఒకవిధమైన అజ్ఞాన మార్గములో మునిగి, అంధత్వములో మునిగి ప్రకాశాన్ని చూడలేకపోతున్నాడు. ప్రాకృతమైన నిజము మార్పు చెందుతూ ఉంటుంది.

**జీవితమంతా సత్యములోనే గడపటం నిజమైన మానవత్వము**

బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, సన్యాసము, ఇవి ఆశ్రమ ధర్మాలు. అయితే ఈ నాలుగు ఆశ్రమ ధర్మముల రూపనామములు మారవచ్చు. ఈ మార్పు చెందేవన్నీ ప్రాకృతమైన నిజము. పారమార్థికమైన నిజము నాల్గింటి యందు ఉన్నది ఒకే వ్యక్తి. కానీ మార్పులు వేరువేరు. మార్పు చెందేది నిజము. మార్పు చెందనిది సత్యము. మార్పు చెందనిదే మూలాధారము. అదే సత్యము. 'సత్యం నాస్తి పరోధర్మః'. సత్యమనే పునాదిపైన ప్రాకృత ధర్మము నిర్మింపబడినది.

srisathyasaivachanamrutam

గోడలకు ఎన్ని రంగులైనా కొట్టవచ్చును. గోడలకు ఎన్ని అలంకారములైనా చేయవచ్చు. గోడకు ఎన్ని పేర్లైనా పెట్టుకోవచ్చు. కానీ పునాదిని మార్చుటకు వీలుకాదు. అదే సత్యము. ఆ సత్యముపైన ఆధారపడినదే ధర్మము. సత్యమును ధరించినదే ధర్మము. సత్యమును వరించినదే ధర్మము. ధర్మాన్ని వరించునదే సత్యము. సర్వమునకు మూలాధారమైనదే సత్యము. ఇలాంటి సత్యసత్వమును ఈనాడు మనం విస్మరిస్తున్నాము. ప్రాచీనవైభవము, ప్రాచీన వేదముయొక్క సంస్కృతి 'సత్యం వద', 'ధర్మంచర!' ఈనాడు మానవులలో సత్యమును ఉచ్చరించే వ్యక్తులు నూటికి ఒక్కరో కోటికి ఒక్కరో కూడా కనిపించటం లేదు. సంవత్సరమునకొక పర్యాయం సత్యన్నారాయణ వ్రతము చేస్తారు. కానీ మిగిలిన సంవత్సరమంతా అసత్యన్నారాయణవ్రతములే. ఎప్పుడో జీవితములో ఒకసారి మనం సత్యము పలుకుతున్నాము. జీవితమంతా అసత్య జీవితమే గడుపుతున్నాము. ఇది కాదు మానవత్వము. జీవితమంతా సత్యము లోనే గడపటం నిజమైన మానవత్వం.

మానవత్వమనగా ఏమిటి? అజ్ఞానము లేకుండా ప్రవర్తించటమే మానవత్వము. ఈ అజ్ఞానము లేకుండా ప్రవర్తించే మానవుడు సత్యమునే ఆధారము చేసుకోవాలి. అతనికే మానవుడని పేరు. మానవ – 'మా' అనగా అజ్ఞానము, 'న' అనగా లేకుండా, 'వ' అనగా వర్తించటము. మానవుడనగా నిన్నమొన్న పుట్టినవాడు కాదు. 'మా' అనగా కాదు, 'నవ' అనగా కొత్త. కొత్తకాదు, మానవుడు. కేవలం ఈ జన్మములో వచ్చినవాడు కాదు మానవుడు. చాలా పురాతనుడు మానవుడు. చాలా సనాతనుడు మానవుడు. నూతనుడు కాదు. ఇలాంటి సత్యస్వరూపము ఈ పదములందే ఇమిడి ఉంది. కనుక మానవుడు సత్యతత్వమునకు జీవితము నంకితము చేయాలి. సత్‌చిత్ ఆనందము. సత్ ఎప్పుడు పర్మనెంటుగా ఉండేది. చిత్ awareness. ఈ awareness శాశ్వతం రెండు కూడేటప్పటికి ఆనందము మనకు సహజమే.

**ఆనందము మన స్వరూపమే!**

ఈనాడు ఆనందమునకు నోచుకోలేక ఆనందముకొరకై అనేక విధములుగా అన్వేషణ జరుపుతున్నాము. నిజానికి, ఆనందము మన స్వరూపమే! కానీ మన ఆకారమును గుర్తించుకోలేక

sri sathyasai vahini vachanamrutam

ఎక్కడెక్కడో చూస్తున్నాము. తన ఆకారము తాను వెతికే మానవుడు ఎంతటి మూర్ఖుడో చెప్పండి. తనను తాను ఎవరైనా వెతకగలరా? ఆనందము కావాలని ప్రపంచములో వెతుకుతున్నాము. ఆనందము కోసము ప్రాకులాడుతున్నాము. పదార్థములో ఆనందము లభిస్తుందని పదార్థమును విచారిస్తున్నాము. వ్యక్తితో ఆనందము లభిస్తుందని వ్యక్తులను కలుస్తున్నాము. కార్యములో మనకు ఆనందము లభిస్తుందని అన్ని కార్యములలో ప్రవేశిస్తున్నాము. పరాయి వ్యక్తిలో మనకు ఆనందము లేదు. పదార్థములలో మనకు ఆనందము లేదు. ఇతర విషయములలో మనకు ఆనందము లేదు. ఆనందము తనయందే తన స్వరూపమై ఉంటున్నది. తన ఆనందములో తాను ఓలలాడుతున్నాడు.

**నీటియందె పుట్టి నీటి యందె పెరిగి**
**నీటియందడంగు నీటి బుడగ**
**నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు**
**వినుడు భారతీయ వీర సుతుడ!**

మనము ఆనందములోనే పుట్టాము. ఆనందమునందే పెరుగుతున్నాము. ఆనందమునందే అంత్యమైపోతున్నాము. మనము జీవించేది, పెరిగేది, అనుభవించేది ఆనందము అనే సత్యాన్ని గుర్తించుకోలేకపోతున్నాడు మానవుడు. ఇంతటి అజ్ఞాని అయ్యాడు మానవుడు. ఇదే మాయ.

**బ్రతుకులన్నియు మాయ**
**భవబంధములు మాయ**
**సంసారమదిమాయ చావుమాయ**
**మాయ బ్రతుకుకింత మాయలో పడనేల?**

నీకై నీవే పడుతున్నావు మాయలో. మాయ నీకు ప్రత్యేకంగా ఎక్కడా కనిపించదు. మాయ అనేది లేదు. లేనటువంటిదానికే 'మాయ' అని పేరు. ఎక్కడుంది మాయ? ఉంటే కదా చెప్పటానికి! తాడును చూచి పాము అని భ్రమిస్తున్నావు. ఈ భ్రమించటం చేత దూరముగాపోతున్నావు తాడుకు. టార్చిలైటు వేసేటప్పటికి ఇది తాడు అని తెలిసింది. భయము పోయింది. తాడును చేతితో పట్టుకున్నాడు. పాము అనుకున్నప్పుడు, అది తాడే! తాడు

sri sathyasaivachanamrutam

అనుకున్నప్పుడు, అది తాడే! లైటు వేస్తూనే పాము పోలేదు. తాడు రాలేదు. అప్పుడు, ఎప్పుడు ఉన్నది తాడే! అప్పుడు ఇప్పుడు నీవు ఆనంద స్వరూపుడవే. అజ్ఞానముచేత ఆనందము పోయినట్టుగా ఉంది. జ్ఞానము వచ్చినప్పుడు ఆనందము అనుభవించినట్టుగా ఉంది. రాకపోకలు లేని దివ్యతత్త్వమే ఆనందము. సత్యమును గుర్తించినప్పుడు సర్వము గుర్తించిన వారమవుతాము.

**త్రికరణ శుద్ధియే సత్యస్వరూపము**

ఈ సత్యమనగా ఏమిటి? అదే త్రికరణ శుద్ధి. ఏది నీ హృదయములో ఆవిర్భవించిందో దానిని వాక్కులో ఉచ్చరించు. వాక్కుతో ఉచ్చరించిన దానిని హస్తముతో ఆచరించటము. ఈ మూడింటి ఏకత్వమే సత్యం. సన్నిహిత సంబంధ బాంధవ్యముతో కూడినవి. మూడు దినముల క్రితము చెప్పాను: ఆత్మనుండి ఆవిర్భవించింది అహం. ఆత్మకు కుమారుడు అహం. అహం నుండి ఆవిర్భవించింది మనస్సు. మనసు ఆత్మకు మనుమడు. మనస్సు నుండి ఆవిర్భవించినది వాక్కు. ఆత్మకు ముని మనుమడు. ఆత్మ, అహం, మనస్సు, వాక్కు. ఇవన్నీ ఒక కుటుంబమే. హృదయమునుండి వచ్చినదే వాక్కు. వాక్కునుండి వచ్చినదే క్రియ. త్రికరణ శుద్ధియే సత్యస్వరూపము. సత్యము అనేది విన్నది కన్నది కాదు. సత్యము నా స్వరూపమే. దీని వలన ఈ సత్యమును విస్మరిస్తున్నాము. (ప్రాకృత విషయములో మీరు విచారించి చూచినప్పుడు)

విద్యార్థులారా! ఒక్క భార్యను పెండ్లాడిన వ్యక్తి ఎన్నో కష్టములకు గురైపోతుంటాడు. సంసారమంటే సుఖము కాదు, కొంచెమే సారముంది. అధికమైన ఆనందము కాదు. అల్పమైన ఆనందము. ఒక్క భార్య ఉండినప్పుడే ఆ కుటుంబములో అనేక అలజడులు ప్రారంభమవుతాయి. ఇద్దరు భార్యలు వస్తే మరింత బాధ అధికమవుతుంది. ఇద్దరు భార్యలున్న వ్యక్తి అనేక కష్టములకు గురౌతుంటాడు. ఇద్దరు భార్యలున్న ధ్రువుని తండ్రి అనేక కష్టములకు గురయ్యాడు. మొదటి భార్య కుమారుని ఒడిలో కూర్చోపెట్టుకోకూడదు. రెండవ భార్య కుమారుడే కూర్చోవాలి అని జగడము వేస్తూ వచ్చింది రెండవ భార్య. ఈ బాధ భరించుకోలేక కుమిలిపోయాడు పాపం. ముగ్గురు భార్యలు కలిగిన వ్యక్తి దశరథమహారాజు. మీకు తెలుసు. ఇతడు కడపటి భార్యకు పూర్తిగా లొంగిపోయాడు. మొదటి భార్య కుమారుడైన శ్రీమన్నారాయణునే అరణ్యమునకు పంపించాడు. ఇంక పదిమంది భార్యలున్న వాని గతి

sri sathyasai vachanamrutam

ఏమిటి? ఎవరికి ఉన్నారు? మనస్సుకు పది మంది భార్యలున్నారు. అవే దశేంద్రియములు. దశేంద్రియములకు అధిపతి కనుక దశేంద్రియాధిపతి అని పేరు. ఇంద్రియములు ఎన్ని అవస్థలకు గురిచేస్తున్నాయి మనస్సును. కన్నులనే భార్యలు చెబుతున్నాయి 'నాకు మంచి టి.వి. తెచ్చిపెట్టండి, మంచి సినిమాకు తీసుకుపోండి', అని. నాలుక చాలా బాధపెడుతున్నది, 'మసాలదోసె, పెరుగు వడ, అన్నీ తెచ్చిపెట్టండి,' అని. 'నాకు సుగంధ పుష్పమందించ'మని నాసిక కోరుతున్నది. ఏమేమో కావాలని ఆశిస్తున్నది. అందరిని ఏవిధముగా తృప్తి పరచటానికి వీలవుతుంది? ఒక్క ఇంద్రియమునే తృప్తి పరచటం కష్టముగా ఉంటే దశేంద్రియములను ఏవిధంగా తృప్తి పరచాలి? దశేంద్రియములను తృప్తి పరచలేక మనస్సు ఘోరమైన అవస్థలకు గురౌతున్నది.

అప్పుడే మనస్సు 'నాకు ఈ సంసారము వద్దు', అని ఇంద్రియములను నిగ్రహించుటకు ప్రయత్నము చేస్తున్నది. ఏవిధంగా చింతపడుతున్నది మనసు?

**పుట్టుట ఒక చింత భూమినుండుట చింత**
**సంసారమొక చింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్ధక్యమొక చింత**
**జీవించుటొక చింత చెలిమి చింత**
**కర్మలన్నియు చింత కష్టంబు లొక చింత**
**సంతసమొక చింత వింత చింత**

అప్పుడు మనస్సు సర్వేశ్వరుని ప్రార్థిస్తుంది. అంతవరకు సర్వేశ్వరుని చింతించదు. 'సంకటమొస్తే వేంకటరమణా' అని, కష్టములు ప్రాప్తించినప్పుడే మనసు దైవాన్ని చింతిస్తూ వస్తుంది. ఎప్పుడు ఈ చింత మనకు వస్తుంది? సత్యమును మరచినప్పుడే చింతలన్నీ వస్తుంటాయి.

**సత్యము సాధించలేనిది జగత్తులో లేదు**

సత్యము అనుసరించు. సర్వమునందు విజయమును సాధించగలవు. విజయము సత్యమునే వరిస్తుంది. మరొకదానిని వరించదు. భుజ బలము, బుద్ధి బలము, జనబలము ఏది ఉండినా దానికి ఏమాత్రము లొంగదు. సత్యము దేనికి లొంగదు. సత్యము కూడా



sri sathyasaivachanamrutam

విజయమునే వరిస్తుంది. సత్యమును జయించేది జగత్తులో మరొకటి ఏమీ లేదు. సత్యమేవ జయతే. దీనికంటె విజయమును సాధించేది మరొకటి లేదు. ఉన్నది ఒక్కటే అయినా పండితులు అనేక రీతులుగా ప్రకటిస్తూ వస్తున్నారు. సత్యమును అనుసరిస్తే సత్యమేవ జయతే. ఎలాంటి కఠినమైన సమస్యలనైనా సులభంగా సాధిస్తుంది. సత్యము సాధించలేనిది జగత్తులోనే లేదు. దేనినైనా సాధిస్తుంది. భూమిని ఆకాశము చేస్తుంది. ఆకాశమును భూమి చేస్తుంది. కనుక సత్యమునే ఆశ్రయించాలి. సత్యమే దైవము. సత్యమును మనము విస్మరిస్తే జీవితమే లేదు. ఈనాడు ప్రపంచములో సత్యమును విస్మరించటం చేత అనేక దుఃఖములకు, అనేక నష్టములకు, అనేక బాధలకు గురౌతున్నారు. ఎంతటి అధికారము చేపట్టినా మనకు విజయము చేకూరదు. అధికారములో సత్యమే లేదు. ఎంత చదువులు చదివినా ఈ చదువులలో ఏమాత్రము సత్యము లేదు. కారణం ఏమిటి? ఇవన్నీ ప్రాకృతవిద్యలు. ఇవి ప్రాకృత చర్యలు. ఇవన్నీ ప్రవృత్తి లక్షణాలు. సత్యము నివృత్తి మార్గము. సత్యము నివృత్తి తత్త్వము. నిత్య సత్యమైన స్వరూపము. ఇట్టి సత్యమును సాధించినప్పుడే మనము విజయమును సాధించినవారమవుతాము.

విద్యార్థులారా! ఎలాంటి పరిస్థితులు వచ్చినా మనం ఎదుర్కొని, సత్యముతో సాధించటానికి ప్రయత్నించాలి. ఎలాంటి పరిస్థితులందైనా ఇచ్చిన మాటలు నిలబెట్టుకోటానికి పూనుకోవాలి. ఒక తూరి మాట యిచ్చామా లైఫ్ ఉన్నంతవరకు సత్యము నిలబెట్టుకోవాలి. వామనుడు వచ్చాడు. దానము అడిగాడు. ఇస్తానని ప్రామిస్ చేశాడు. కానీ తన గురువైన శుక్రాచార్యుడు ఇవ్వవద్దని బోధించాడు. అప్పుడు బలి చక్రవర్తి చెప్పాడు "పలికి బొంకుట కంటె పాపమున్నె! మీరు గురువు కావచ్చు నేను ఇచ్చిన మాట తప్పను. మాట ఇచ్చాను ఏమైనా సరే తప్పను", అని. మనము ఇట్టి పవిత్రమైన జీవితము గడపటానికి ప్రయత్నించాలి. ఇంతమందిలో ఏ పదిమంది నిల్చినా చాలు. ప్రపంచమును మనం కాపాడవచ్చు. ఎంతమంది మనం సత్యమును కాపాడుకొంటున్నాం? ఎంతమంది మనం ధర్మాన్ని నిలబెట్టుకో గలుగుతున్నాం? లేదు, వింటున్నాము అనేక ఉపన్యాసములు. చదువు తున్నాము, వేలాది గ్రంథములు. చూస్తున్నాము, నూర్ల కొలది మహనీయులను. ఏమిటి నీవు అనుసరిస్తున్నావు? ఏమిటి ఆచరిస్తున్నావు. ఏమిటి నీ అనుభవములోకి తెచ్చుకున్నావు. ఏమీ లేదు. పండితుడు అని పేరు పెట్టుకుంటారు. పండితుడంటే ఏమిటి? వేదశాస్త్ర ఇతిహాసములను పఠించినవాడా

srisathyasaivahini.org

పండితుడు లేక సర్వశాస్త్ర ప్రవీణుడా పండితుడు. కాదు కాదు. భగవద్గీత అన్నింటిని ఖండించి "పండితః సమదర్శినః" అనింది. సుఖదుఃఖములందు, పాపపుణ్యములందు, నిందాస్తుతులందు కష్టనష్టములందు ఒకే మనస్సును కల్గినవాడు పండితుడు. శీతోష్ణములు ఏమాత్రము పట్టకూడదు. అదీ ఉండాలి. ఇదీ ఉండాలి. ఇది ప్రాకృత లక్షణములు, ప్రాకృత ధర్మములు. ఎండ లేక చలి ఉండాలంటే చలిని ఎంతకాలమో ఆశించలేవు. తిరిగి ఎండ కావాలని కోరతావు. ఎండ తీవ్రముగా కాస్తుంటే ఎండ భరించలేము. చల్లదనము కావాలని కోరుతున్నాము. ఇది నీ చేతిలో ఉందా! ఇది భగవంతుని అనుగ్రహము. ప్రపంచమునకే ద్వైతమని పేరు. ద్వైతం ఉంటేనే మానవునికి రాణింపు గలుగుతుంది. ఈ రెండు ఉండటం చేత మానవుడు సుఖ, శాంతులను అనుభవించగలుగుతున్నాడు. నిరంతరము తీపి తినుటకు ఎవరు ఇష్టపడరు. పది దినములు తీపి తింటే పదకొండవ దినము పికిల్సు తీసుకోవాలి. పికిల్సు దినము తింటుంటే తీపికావాలని ఆశ వస్తుంది. సుఖ దుఃఖములు, లాభనష్టములు రెండు ఉంటాయి. అయితే ద్వైతములో ఏకత్వము మనము గుర్తించాలి. సృష్టిలో ద్వైతముంటున్నది కదాయని మనము ద్వైతములో పోకూడదు.

**మానవత్వము మాధవత్వమును పొందుటకొరకే వచ్చింది**

మనస్సు కేవలం గడియారము పెండ్యులమువలె ఆడుతుంది అటుఇటు. ఇది ఆడేంతవరకు జీవబ్రహ్మాదులు. మినిట్ ముల్లు, గంట ముల్లు తిరుగుతూ ఉంటాయి. జీవాత్మ, పరమాత్మ తిరుగుతూనే ఉంటాయి. చేరేది ఎప్పుడు? ఎప్పుడు ఈ పెండ్యులము ఆగిపోతే అప్పుడు చేరిపోతాయి. ఈ మనస్సనే పెండ్యులమును ఆపు చేయటానికి ప్రయత్నించాలి. నీకు టైము కావాలని కోరుకునేంతవరకు ఈ పెండ్యులం తిరుగుతూనే ఉండాలి. ఏకత్వమును గుర్తించిన తరువాత టైమే అక్కరలేదు. Time is God. 'కాలాయనమః, కాల కాలాయనమః '. అంతా కాలమే! కాలమును కాలుడు మింగుతున్నాడు. కానీ మానవుడు కాలునే మింగుతున్నాడు. అలాంటివాడే నిజమైన మనిషి. కాలమునకు మనము వెఱువకూడదు. కాలమును మనం హస్తగతము గావించుకోవాలి. కాలము మనచేతిలో ఉంటున్నది. కాలమే దైవ స్వరూపము. దైవము నీ హృదయమే. దైవము నీ హృదయములో నిల్చిఉన్నాడు. ఇంత

srisathyasaivachanamrutam

గొప్పవాడు మానవుడు. భగవంతుని తన స్వాధీనము చేసుకున్నాడు మానవుడు. అలాంటి మానవుని కించపరచుకోటం సరియైనది కాదు. 'జంతూనాం నరజన్మ దుర్లభం'. నరజన్మ అని కించపరచుకోకూడదు. నర జన్మను నారాయణునకు అర్పితము చేయాలి. అందుకోసమే వచ్చింది ఈ మానవత్వము. మాధవత్వము పొందే కోసమే వచ్చింది. పశుత్వము నుండి మానవత్వమునకు వచ్చింది. మానవత్వము నుండి దైవత్వమునకు పోవాలి. కానీ దురదృష్టవశాత్తు మానవుడు తిరిగి పశుత్వమునకు దిగజారిపోతున్నాడు. ఈ రివర్సుగేరు మనం use చేయకూడదు. అంతా ముందుకు పోవాలి. ఎక్కడా ఆగకూడదు. ఎక్కడ ఆగాలి? గమ్యము చేరేంతవరకు ఆగకూడదు. అదే మానవుని జీవితప్రయాణము. మానవుడు ధర్మక్షేత్రయాత్రికుడు, ఈ యాత్ర పూర్తికావాలి. నీ పాత్ర పూర్తి గావించుకోవాలి. అదే మానవుని నిజమైన ఆశయము.

**సత్యమే పూర్ణము, పూర్ణమే సత్యము**

Life అంటే ఏమిటి? 4Fలు చెప్పాను. F-follow the master. Who is your master? Your conscience is your master. అదే మొదటిది. 2వF-Face the devil. 3F fight to the end. 4వ F finish the game. అదే జీవిత గమ్యము. Life is a game, play it. Life is a dream, realise it. Life is love, enjoy it. Life is a challenge, meet it. జీవితము ఇంత అంతరార్థముతో కూడినది. ఇంత రహస్యమైనది. ఇలాంటి రహస్యమైన, ఇలాంటి పవిత్రమైన, ఇలాంటి దివ్యమైన, ఇలాంటి భవ్యమైన, ఇలాంటి నవ్యమైన మానవత్వమును కించిత్ పరచుకుంటున్నాము. కారణం ఏమిటి? సత్యమును మరచిపోవటమే. 3/4 th truth is life అన్నారు. కానీ నేను ఒప్పుకోను. పూర్తిగా సత్యమే జీవితము. భగవంతుడు పరిపూర్ణుడు.

**పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే**

అతను పూర్ణమే, నీవూ పూర్ణమే, జగత్తు పూర్ణమే. అంతా పూర్ణమే కాబట్టి సత్యమే పూర్ణము. పూర్ణమే సత్యము.



sri sathyasai vahamrutam

ఈ సత్యము గుర్తించి సాధ్యమైనంతవరకు మన నోటినుండి అసత్యము రాకుండా చూచుకోవాలి. ఒకవేళ సత్యము చెబుతే ప్రమాదమో లేక ఇక్కట్లో కలిగే పరిస్థితి ఉంటే సత్యము చెప్పవద్దు, అసత్యము చెప్పవద్దు. మౌనము వహించు. ఒకానొక సమయములో ఇంద్రుడు ఒక మహాయోగిని పరీక్షించటానికి ప్రయత్నించాడు. అతను రెండు ప్రతిజ్ఞలు పట్టాడు. పరులను హింసించను. అసత్యమాడను. ఈ రెండింటిని జీవితములో సాధించాలని పట్టుదలతో తపస్సు చేస్తున్నాడు. భగవంతుడు ఒక జింకను ఈ తపస్సు చేసేవానిముందుగా పోయేటట్లు చేశాడు. ఈ జింక పోవటంచేత యోగి కన్నులు తెరచి చూచాడు. ఆ జింక పొదలోకి పోయింది. వచ్చాడు వేటగాని వేషములో నున్న ఇంద్రుడు. 'స్వామీజీ! నేను ఒక జింకను తరుముకొని వచ్చాను. మీరేమైనా చూచారా!' అని అడిగాడు. చూడలేదంటే అసత్యము, చూచానంటే ఎక్కడ ఉంది అంటాడు. పొదలో ఉందంటే దానిని హింసిస్తాడు. కాబట్టి ఒక ప్రాణిని హింసించను అనే ప్రతిజ్ఞ తప్పిన వాడౌతాడు. చూడలేదంటే అసత్యమాడిన వాడౌతాడు. అప్పుడు భగవంతుని ప్రార్థించాడు, యోగి: 'ఓ భగవంతుడా! నీ తలంపు నాకందించ'మన్నాడు. భగవంతుడు ఆ vision అందించాడు. నిర్మల హృదయముతో ప్రార్థించిన వానికి క్షణముల లోపలే జవాబు ఇస్తాడు భగవంతుడు. కేవలం పెదవులతో ప్రార్థన చేసేవారికి ఎన్ని సంవత్సరములైనా జవాబు ఇవ్వడు. హృదయముతో ప్రార్థించేవారికి తక్షణమే resound, reflection వస్తుంది. యోగి చెబుతున్నాడు, వేటగాడితో 'ఏది చూచెనో అది పల్కదు, ఏది పల్కునో అది చూడలేదు ఏమందు భువి, కన్నులు చూచినాయి కానీ కన్నులు చెప్పలేవు. నోరు లేదు దానికి. నోరు చెప్పగలదు కానీ చూడలేదు. చూడలేని దానిని ఎట్లా చెబుతుంది. చెప్పలేదు. చూచినది ఒకటి చెప్పేది మరొకటి ఇది అసత్యము' అన్నాడు. ఈ విధముగా తప్పించుకున్నాడు. ఇది సరైన మార్గము. ఈ ప్రాకృతమైన జీవితము గడుపుతున్నవారు ఇలాంటి సందిగ్ధావస్థయందు ఈ విధముగా తప్పించుకొనుటకు ప్రయత్నించాలి. సత్యము చెప్పి ప్రమాదము తేకూడదు. అసత్యము చెప్పి పాపములో మునగకూడదు. రెండింటికి మధ్యేమార్గము అనుసరించు. ఎందుకనగా ఇది మిథ్యాలోకము. ఈ బాల్యమందు సాధ్యమైనంతవరకు అసత్యమాడకుండా చూచుకోండి. అసత్యమాడే పరిస్థితి వస్తే అసత్యము చెప్పండి. రెండూ లేకపోతే మౌనము వహించు.

1996 జూలై 3వ తేది  సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasai vahini amrutam